

ప్రాణం పోసిన తల్లిదండ్రులను పాణంగా చూసుకోవాలని మేనేజర్ ఉద్యోగాన్ని వదిలి ఊరికి వచ్చాడు. పాణాలను హరించే తిండి కాదు, ఆయువు పోసే ఆహారం అందరికీ అందివ్వాలని రైతుగా మారాడు. రైతు ప్రాణం విత్తనంలోనే ఉందనీ, దాన్ని కాపాడుకునేందుకు దేశమంతా తిరిగాడు. దేశీ పంటల విత్తనం చచ్చిపోకుండా విత్తన సేద్యం చేశాడు. వేల రకాల వంగడాలను ప్రాణంలా కాపాడుకుంటున్న దార్లపూడి రవి విత్తులోనే.. రైతులు, భావితరాల భవిష్యత్తు ఉందంటున్నాడు!



# విత్తులోనే ఉంది భవిష్యత్తు




**నేను** ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ చదివాను. మట్టపల్లి (సూర్యాపేట జిల్లా) దగ్గర ఉన్న నాగార్జున సిమెంట్స్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేశాను. మా తమ్ముడు బెంగళూరులో, చెల్లెలు ఉద్యోగం చేస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న మా అమ్మా నాన్నలను చూసుకోవాలనుకున్నా! అలాగే నాకిష్టమైన వ్యవసాయం చేయాలని ఉద్యోగానికి రాజీనామా చేశాను. మా ఊరు ఉంగరాడ (విజయనగరం)లో మాకు రెండు ఎకరాల ఇరవై సెంట్ల భూమి ఉంది. అది కొండవాలు కింది పొలం. అందులో వర్షాధార పంటలే పండుతాయి. ఒక ఎకరా యాభై సెంట్లలో నాన్న మామిడి తోట పెట్టించారు. చెట్టుకు చెట్టుకు మధ్య 30 అడుగుల దూరం ఉంది. కాబట్టి అంతర పంటలు సాగు చేసే అవకాశం ఉంది. అందులో పెసలు, ఉలవలు, నువ్వులు పండించాను.

ఇదిలా ఉండగా పెండ్లిళ్లు, ఇతర వేడుకలకు వెళ్లినప్పుడు కొంతమంది గ్యాస్ట్రిక్ అల్సర్, అజీర్తి, పైల్స్, బీపీ, ఏదో ఒక రోగం పేరు చెబుతూ తిండి తగ్గించడం చూశాను. జిహ్వ చాపల్యం కొద్దీ తిన్నా.. ఇంటికి పోయి మాత్ర వేసుకుంటున్నారు. వాళ్ల సమస్యలకు కారణం రసాయనాలతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులే! ఈ దుస్థితి పోవాలంటే మళ్లీ తాతల కాలంనాటి సేంద్రియ వ్యవసాయం అవసరమనుకున్నాను. రసాయన అవశేషాలు లేని కాయగూరలు, ధాన్యం పండించాలనుకున్నాను. ఇంటి పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూనే నా స్నేహితుడు నడిపే వ్యవసాయ సంబంధిత ఎన్జీవోలో చేరాను. రైతులతో కలిసి పయనించాను.

## పాత రుచులు కొత్త ప్రయాణం...

సాహు అనే ఉత్తరాది రైతు చిరుధాన్యాలు, పప్పులతో రాగి జంతికలు, రాగి లడ్డూలు, బిస్కట్లు, అరిసెలు మొదలైన ఎన్నో రకాల వంటకాలను తయారు చేస్తాడు. మన వాతావరణం, మన శారీరక అవసరాలకు తగినట్టుగా ఉండే ఈ సంప్రదాయ వంటకాల వల్ల ఆరోగ్యమే కాదు, దేశీయ విత్తనాలను సాగుచేసే రైతుకు ఉపాధి కల్పించవచ్చు. దేశవాళీ విత్తనాలు నిల్వ చేయడం కష్టం. మళ్లీ మళ్లీ సాగు చేస్తే ఆ దిగుబడిని ఏం చేయాలి? ఈ సమస్యకు సాహు దగ్గర నాకో పరిష్కారం దొరికింది. కొన్ని విత్తానాలను సీడ్ బ్యాంక్‌లో భద్రపరచాలి. మిగతావాటితో సాగు చేసి, వచ్చిన దిగుబడితో సంప్రదాయ వంటకాలు తయారు చేయాలి. ఇలా చేయడం వల్ల విత్తన సేద్యం చేసే రైతుకు ఆర్థికంగా మద్దతు లభిస్తుంది. నేను కూడా ఆయన్ని అనుసరించాను. భాస్కర ఆర్గానిక్ అండ్ నేచురల్స్ సంస్థను ప్రారంభించి.. విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టాను. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, గానుగ నూనెలు, బిస్కెట్లు, స్నాక్స్ అమ్ముతున్నాను.